

ప్రచారానికి అనుమతులు తప్పనిసరి

ప్రజాశక్తి-పాడేరు: అన్ని రాజకీయ పార్టీల నేతలు దిన పత్రికలలో, వివిధ చానెళ్ళలో ప్రకటనలకు, సభలు, సమావేశాలకు, ర్యాలీలు తదితర కార్యక్రమాలకు దరఖాస్తులను పరిశీలించి మీడియా సర్టిఫికేషన్ అండ్ మోనట్రింగ్ కమిటీ ముందస్తు అనుమతులను జారీ చేయాలని జిల్లా రెవిన్యూ అధికారి బి.పద్మావతి సూచించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎంసిఎంసి సభ్యులతో నిర్వహించిన శిక్షణా శిభిరంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ, ఎన్నికల ప్రతికూల వార్తలు, ముందస్తుగా జారీ చేసిన అనుమతులకు సంబంధించి రిజిస్టర్లను నిర్వహించాలన్నారు. మాస్టర్ ట్రైనీగా పాల్గొన్న జిల్లా ఆడిట్ అధికారి సువర్ణ ఫణి ముందస్తు అనుమతలకు దరఖాస్తు విధానం, అనుమతుల జారీ, రిజిస్టర్ల నిర్వహణ, తదితర అంశాలపై తగు శిక్షణను అందించారు. ఈ శిక్షణలో ఎంసిఎంసి సభ్యులైన డిఆర్ఓ బి.పద్మావతి, డిపిఆర్ఓ పి.గోవింద రాజులు, డివిజనల్ పిఆర్ఓ పి.రాములు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి జి.గౌరిశంకర్‌రావు, పి.సూర్యారావు, పి. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కూటమి, వైసిపి అభ్యర్థులను ఓడించండి

- సిపిఎం అరకు పార్లమెంట్ అభ్యర్థి అప్పలనర్స - కింజేరులో ముమ్మర ప్రచారం - ఘన స్వాగతం పలికిన గిరిజనులు



మాట్లాడుతున్న సిపిఎం ఎంపీ అభ్యర్థి అప్పలనర్స

ప్రజాశక్తి-డుంబ్రిగూడ: ఆదివాసి వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ రాజ్యాంగంలో గిరిజనులు కల్పించిన హక్కులను చట్టాలను తుంగలో తొక్కి అటవీ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్న టిడిపి, బిజెపి, జనసేన కూటమిని, వైసిపిని ఓడించాలని అరకు పార్లమెంట్ సిపిఎం ఎంపీ అభ్యర్థి పి.అప్పలనర్స పిలుపు నిచ్చారు. మండలంలోని రంగిలిసింగి పంచాయతీ కింజేరులో పంచాయతీ సిపిఎం మాజీ సర్పంచ్ పి.అచ్చమ్మ, డొంబు ఆధ్వర్యంలో శనివారం సిపిఎం నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ప్రచారానికి వెళ్లిన సిపిఎం ఎంపీ అభ్యర్థి అప్పలనర్సకు, అనంతగిరి జడ్పిటిసి గంగరాజుకు, ఆ పార్టీ నాయకులకు ఆ పంచాయతీ గిరిజనులు పూలమాలలు వేసి, గిరిజన సంప్రదాయ బద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో అప్పలనర్స మాట్లాడుతూ, టిడిపి బిజెపి కూటమి, వైసిపి పార్టీలు ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న ఖనిజ సంపదను కొల్లగొట్టేందుకే ప్రయత్ని స్తున్నారన్నారు. గతంలో సిపిఎం పోరాట ఫలితంగా వచ్చిన అటవీ హక్కుల చట్టానికి వ్యతిరేకంగా ఏజెన్సీ ప్రాంతంలో హైడ్రోపవర్ ప్లాంట్ నిర్మించడానికి అటవీ ప్రాంతాన్ని బడా బాబులకు కట్టబెట్టేందుకు బిజెపి. వైసిపి ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నాయని విమర్శించారు. ఆదివాసుల సమస్యలను పట్టించు కోకుండా దోచుకోవడం, పంచుకోవడమే ఆ పార్టీల విధానమని, అటువంటి కార్పొరేట్ పార్టీలను ఎన్నికల్లో ఓటుతో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.

అనంతగిరి జెడ్పిటిసి గంగరాజు మాట్లాడుతూ, సిపిఎం ఎప్పుడు గిరిజనుల పక్షాన నిరంతరం సమస్యలపై పోరాడుతూనే ఉంటుందన్నారు. బోయ/వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడానికి రాష్ట్ర కేబినెట్ తీర్మానించినా ఇక్కడి ఏజెన్సీ ప్రాంత ఎమ్మెల్యేలు, ఎంపీలు కనీసం నోరు మెదపలేదన్నారు. రాష్ట్ర చట్టసభల్లో, కేంద్ర పార్లమెంట్‌లో ఆదివాసీల పక్షాన ఎంతటి వారినైనా సరే గట్టిగా నిలదీసి ప్రశ్నిస్తామన్నారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో సిపిఎం అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు పి.బాలదేవ్, సిపిఎం మండల ప్రధాన కార్యదర్శి ఎస్‌బి పోతురాజు, మండల నాయకులు సురేష్ కుమార్, పి సత్యనారాయణ, పి.తిలక్, అర్జున్, ఉపసర్పంచ్ పి.దాసు, గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యుడు డాంబుదోర్, చిట్టిబాబు, మహిళా సంఘం నాయకులు పి.కుమారి, కె.మాలతి, గిరిజనులు, మహిళలు పాల్గొన్నారు.



సిపిఎం నేతలు అప్పలనర్స, గంగరాజులకు స్వాగతం పలుకుతున్న గిరిజనులు




పిడుగుపాటుతో మృతి చెందిన పశువులు

అనంతగిరిలో భారీ వర్షం

- ఘాట్ రోడ్డుపై విరిగిపడిన భారీ వృక్షం
- పిడుగుపాటుకు దుక్కిటెద్దులు మృతి

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలో శనివారం ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురిసింది. పిడుగుపాటుకు గురై మూడు దుక్కిటెద్దులు మృతి చెందాయి. అనంతగిరి ఘాట్ రోడ్డులో అరుకు ప్రధాన రహదారిపై వృక్షం కూలి పోయింది. మండలంలోని టోకురు పంచాయతీ పరిధి రాయివలస గ్రామానికి చెందిన కొర్రా రామన్న, చంపి సన్యాసి, గుజ్జెల మొంగుడలకు పశువులు పిడుగుపడి మృతి చెందాయి. గ్రామానికి సమీపంలో ఉన్న పొదలలో మేత కోసం పశువులు వెళ్లాయి. ఆ సమయంలో ఆకాశమంతా ఒక్కసారిగా మేఘావృతమై ఉరుములు, మెరుపులు భారీ వానం కురిసింది. దీంతో పశువులు చింత చెట్టు వద్దకు చేరాయి. ఒక్కసారిగా పిడుగు పడటంతో మూడు పశువులు మతి చెందాయి. ఈ విషయం తెలుసుకున్న టోకురు సిపిఎం సర్పంచ్ కిల్లో మొస్య స్థానిక గిరిజనులతో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, బాధిత గిరిజన రైతులకు ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఒక్కొక్క దుక్క పశువు ఖరీదు రూ.30 వేల నుండి 50 వేల ఉంటుందని, తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం నష్ట పరిహారానికి రైతులకు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల సీనియర్ నాయకులు జి. దేవన్న, రైతులు తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుపై కూలిన భారీ వృక్షం

అరకు సీటును బిజెపికి కేటాయిస్తే సహకరించేది లేదు



మాట్లాడుతున్న దొన్నుదొర

-టిడిపి అధిష్టానం నన్ను మోసం చేసింది
-కుటుంబమంతా చనిపోవాలనుకున్నాం : దొన్నుదొర
-పునరాలోచన చేయాలని టిడిపి శ్రేణుల డిమాండ్

ప్రజాశక్తి -అరకులోయ : రాష్ట్రంలో బీజేపి, టీడీపి, జనసేన పొత్తులో భాగంగా అరకు అసెంబ్లీ టికెట్ టిడిపి సమన్వయకర్త సియారి దొన్ను దొరకు కేటాయిస్తేనే పని చేస్తామని, బిజెపికి ఇస్తే సహకరించేది లేదని టిడిపి నాయకులు, కార్యకర్తలు స్పష్టం చేశారు. అరకు టికెట్ దున్ను దొరకు మార్పు చేసి బిజెపి పార్టీకి చెందిన పాంగి రాజారావుకు టికెట్ కేటాయించడంతో టీడీపీ శ్రేణులు రగిలి పోయారు. శనివారం అరకులోయ మండలం పద్మపురంలోని ఉషోదయ రిసార్ట్స్‌లో నియోజకవర్గ మండల అధ్యక్ష కార్యదర్శులు, ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి నియోజకవర్గ ఇన్చార్జి సీయారి దొన్నుదొర హాజరయ్యారు. మండల వారీగా అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి దొన్నుదొర మాట్లాడుతూ, టిడిపి మొదటి జాబితాలో అరకులో జరిగిన రా కదలిరా బహిరంగ సభలో వేలాదిమంది ప్రజల ఎదుట నన్ను తనకు టికెట్ కేటాయించి ఇప్పుడు బిజెపికి ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. నియోజకవర్గంలో పార్టీ మండల నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలు తీసుకోకుండా అధిష్టానం బిజెపికి టికెట్ ఎలా కేటాయిస్తుందని ఆయన మండిపడ్డారు. పార్టీ కోసం నిరంతరం కష్ట పడి పనిచేసి తన సొంత ఆస్తులను అమ్ముకొని పార్టీని నడిపినా అధిష్టానం తనను ఎందుకు గుర్తించ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అరకు నియోజకవర్గంలో టిడిపికి బలంగా ఉందని, ఒక శాతం కూడా ఓటు బ్యాంకు లేని బిజెపికి ఎలా టికెట్ ప్రకటిస్తారని ఆయన అన్నారు. టికెట్ ఇచ్చే ముందు తమను ఎందుకు సంప్రదించలేదని నారా లోకేష్‌ని అడిగినప్పుడు బిజెపి అధిష్టానం ఒత్తిడితోనే బిజెపికి టికెట్ కేటాయించడం జరిగిందని, అధికారంలోకి వస్తే ఎమ్మెల్సీ ఇస్తామని చెప్పారని, తనకు నమ్మకం లేదన్నారు. రా కదలిరా సభలో వేలాది మంది సమక్షంలో ఇచ్చిన మాట చంద్రబాబు నాయుడు తప్పారని ఇప్పుడు ఎలా నమ్ముతామని ఆయన అన్నారు. బిజెపికి టికెట్ కేటాయించిన విషయం తెలుసుకుని ఇంట్లో కుటుంబమంతా మనస్థాపానికి గురై చనిపోవడానికి కూడా సిద్ధమయ్యామని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీలో ఇంత కష్టపడి ముందుకు నడిపించిన నాయకుడికి పార్టీ గుర్తించలేదంటే భవిష్యత్తులో కార్యకర్తలకు ఏమి గుర్తింపు ఉంటుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

అరకు అసెంబ్లీ సీటు తనను కేటాయించాలని చంద్రబాబు నాయుడు కు చెప్పడంతో బిజెపి అధిష్టానం ఒత్తిడితోనే ఇలా జరిగిందని అర్థం చేసుకోవాలని బుజ్జగింపు ప్రయత్నం చేశారన్నారు. అధిష్టానానికి కలిసి వారం రోజులైనా కనీసం స్పందించడం లేదని, నాయకులు, కార్యకర్తలు ఏమి చేస్తే దానికి నేను కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు.

నియోజకవర్గంలోని మండల అధ్యక్షులు కార్యదర్శులు మాట్లాడుతూ, ఓటు బ్యాంకు లేని బీజేపీ పార్టీకి ఎలా సపోర్ట్ చేస్తామని ప్రశ్నించారు. దొన్ను దొరకు టికెట్ వచ్చేంత వరకు పోరాడతామని లేకపోతే స్వతంత్ర అభ్యర్థిగా నిలబెట్టి పోటీ చేయిస్తామని వారు అన్నారు. ఇటువంటి పరిస్థితి ఏ రాజకీయ పార్టీల నాయకులకు రాకూడదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి నీడలో పనిచేయడానికి ఏ కార్యకర్త నాయకులు సిద్ధంగా లేరని వారు స్పష్టం చేశారు. ఇప్పటికైనా పార్టీ అధిష్టానం పునరాలోచించాలని టిడిపి శ్రేణులు కోరారు. పెదలబుడు మేజర్ పంచాయతీ సర్పంచ్ పెట్టెలి దాసుబాబు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో అరకు నియోజకవర్గంలోని ఆరు మండలాల ముఖ్య నేతలు పార్టీ నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



బుర్ర కథ ద్వారా వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

వ్యాధులపై బుర్రకథ ద్వారా అవగాహన

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

డెంగ్యూ, మలేరియా, పైలేరియా, చికిన్ గున్యా, సికిల్ సెల్ ఎనీమియా తదితర వ్యాధులపై స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కిమ్మలగడ్డ, రాజవొమ్మంగి గ్రామాల్లో శనివారం కళాజాతా నిర్వహించారు. బుర్ర కథ బృందం వ్యాధులపై ప్రజలకు బుర్ర కథ కళా రూపంలో వివరించారు. దోమ తెరల వినియోగం, దోమల మందు పిచికారీ గురించి తెలిపారు. ప్రస్తుతం వేసవి నేపథ్యంలో ఎండ తీవ్రత, తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి పిహెచ్‌సి వైద్యాధికారులు సుష్మా, నాగార్జున వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది చీడిపల్లి ప్రసాద్, రామబ్బాయి, లక్ష్మమ్మ, సత్యవతి, రత్న కుమారి, హెల్త్ అసిస్టెంట్లు నానిబాబు, లక్ష్మయ్య, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అడిషనల్ డిఎంహెచ్ఓ కార్యాలయ హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్ వైద్య సిబ్బందికి సూచించారు. స్థానిక పిహెచ్‌సిలో వైద్య సిబ్బందితో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ మాత శిశు మరణాలు, సికిల్ సెల్ ఎనీమియా, సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, కిషోర బాల బాలికలు తీసుకోవలసిన జాగ్రత్తలు, వివిధ అంశాలపై పీహెచ్సీ సిబ్బందికి అవగాహన కల్పించారు

దారాలమ్మ వార్షిక మహోత్సవం ప్రారంభం

ప్రజాశక్తి-సీలేరు

ఆదివాసీల దేవత దారాలమ్మ అమ్మవారి 58వ వార్షిక మహోత్సవం శనివారం ఉదయం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఉదయం అమ్మవారి ఆలయంలో కలుస్థాపన చేశారు. కుంకుమార్చన పూజలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారు ప్రధాన పండుగ కొత్తఅమావాస్య రోజు వైభవంగా జరపడానికి దేవాదాయ శాఖ ఈవో సాంబశివరావు అన్ని చర్యలు చేపడుతున్నారు. ఆంధ్ర, ఒరిస్సా, చత్తీస్‌ఘడ్, తెలంగాణ, ఇతర రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు ప్రధాన పండుగ రోజు తరలివస్తారు. అందుకు అనుగుణంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నారు.

రాజుల స్వామి జాతరకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని శ్రీరామగిరిలో రాజుల జాతరకు రాజుల ఆలయం ముస్తాబవుతోంది. ఉగాదిని పురస్కరించుకొని ఈ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. దీనికోసం గ్రామ పెద్దలు ఏర్పాట్లను చేస్తున్నారు. ఆలయం పరిసరాల్లో చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఆలయానికి రంగులు దిద్దుతున్నారు. మూడు రోజులు ఉగాది ఉండటంతో నిర్వాహకులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

ఆశాలకు వేతన బకాయిలు చెల్లించాలి

ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి

ప్రజాశక్తి-చింతూరు

ఆశా వర్కర్లకు పెండింగ్‌లో వేతనాలు తక్షణమే చెల్లించాలని ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి డిమాండ్ చేశారు. చింతూరు డివిజన్ పరిధిలో నాలుగు మండలాల ఆశా వర్కర్ల సమావేశం శనివారం చింతూరులో జరిగింది. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ధనలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించే విషయంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. కొత్త కొత్త యాప్‌లు తీసుకొచ్చి ఆశ వర్కర్ల మీద పని భారం పెంచిందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఫోన్లలో ఏ ఒక్క ఫోనూ ఏజెన్సీ ప్రాంతంలో పనిచేయడం లేదని, దీంతో ఆశా వర్కర్లందరూ సొంతంగా సెల్ ఫోన్లు కొనుగోలు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. తక్షణమే ప్రభుత్వం ఏజెన్సీలో పని చేసే విధంగా కొత్త సెల్ ఫోన్లు కొనుగోలు చేసి ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాలుగు మండలాల్లోని 10 పీహెచ్‌సీల్లో ఆశా వర్కర్లకు వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, మెడికల్ ఆఫీసర్లు ఆశా వర్కర్లను వేధింపులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. మెడికల్ ఆఫీసర్లు తమ పద్ధతి మార్చుకోకపోతే ఆందోళనకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి

విఒఎలపై వేధింపులు ఆపాలి

అనంతరం వివోఏలతో జరిగిన సమావేశంలో ధనలక్ష్మి మాట్లాడారు. విఒఎలకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని, ఏపీఎంలు, సీసీల వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియూ ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్, నాయకులు కొమరం పెంటయ్య. పొడియం లక్ష్మణ్, కారం సుబ్బారావు, తెప్పల లక్ష్మయ్య, ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు రవ్వ వీరమ్మ, నాలుగు మండలాల పిహెచ్‌సి లీడర్లు జయ, శారదా, నూతన, వివోఏల సంఘం నాయకులు గొర్రె లక్ష్మయ్య, రత్నకుమారి, లీలావతి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల కల్పనలో ప్రథమ స్థానం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని 19 పంచాయితీల పరిధిలో ఉపాధి హామీ పనులు కల్పించడంలో రాజవొమ్మంగి మండలం అల్లూరి సీతారామరాజు జిల్లాలో వరసగా రెండో ఏడాది కూడా ప్రథమ స్థానంలో నిలిచినట్లు ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ఉపాధి సిబ్బందితో శనివారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 8,400 కుటుంబాలు జాబు కార్డులు కలిగి ఉండగా, అందులో ఇప్పటికే సుమారు 3000 కుటుంబాలకు పైబడి వంద రోజులు పని కల్పించడం జరిగిందని తెలిపారు. ఉపాధి హామీ పథకం చరిత్రలో మండలంలో మొదటిసారిగా 6,54,047 పని దినాలు మార్చి నెలాఖరు నాటికి సాధించినట్లు చెప్పారు. ఏడాదికి సగటున 77.48 రోజులు పనులు కల్పించినట్లు వెల్లడించారు. కూలీలకు రూ.241 సగటు వేతనం అందినట్లు తెలిపారు. ఉపాధి కూలీలకు ఈ ఏడాది రూ.15.84 కోట్లు వారి ఖాతాలో జమ చేసినట్లు చెప్పారు. మెటీరియల్ రూపంలో రూ.2.97 కోట్లు చెల్లించామన్నారు. 2023-24 వార్షిక సంవత్సరంలో కూడా ఉపాధి హామీ పనులు అమల్లో అల్లూరి జిల్లాలో రాజవొమ్మంగి మొదటి స్థానంలో నిలిచినట్లు తెలిపారు. వరుసగా రెండు సంవత్సరాలు ప్రథమ స్థానంలో నిలవడం పట్ల ఎన్ఆర్ఇజిఎస్ సిబ్బందికి అభినందనలు తెలిపారు. ఈ ఏడాది కూడా లక్ష్యానికి అనుగుణంగా పని చేయాలని సూచించారు. ఉపాధి పనుల్లో ఎక్కడైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీఓ సురేష్ కుమార్, పలువురు ఉపాధి కార్యాలయ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



మండల పరిషత్తు కార్యాలయం వద్ద ఎన్ఆర్ఇజిఎస్ సిబ్బందితో ఎంపిడిఓ యాదగిరీశ్వరరావు



సమావేశంలో పాల్గొన్న వివిధ మండలాల జనసేన నాయకులు

జనసేన విచ్ఛిన్నకులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-విఆర్.పురం

జనసేన పార్టీని విచ్ఛిన్నం చేస్తున్న వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ రంపచోడవరం డివిజన్ నాయకులు పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌కు విజ్ఞప్తి చేశారు. జనసేన పార్టీ రంపచోడవరం డివిజన్ ముఖ్య కార్యకర్తలు సమావేశం కునవరం మండలం కేంద్రంలోని టేకుల బోరు గ్రామంలో పార్టీ లీగల్ సెల్ ఉపాధ్యక్షుడు కాకి స్వామి ఆధ్వర్యంలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2014లో పార్టీని స్థాపించినప్పటి నుండి 11 మండలాల్లో ఎంతో కష్టపడి జనసేన పార్టీని బలోపేతం చేశామని తెలిపారు. ఎక్కడా లేని విధంగా కూనవరంలో ఒక ఎంపీటీసీ, ఒక సర్పంచ్ గెలుచుకోవడం జరిగిందన్నారు. అన్ని మండలాల్లో బలమైన కార్యకర్తలు ఉండగా, 6 నెలల క్రితం వైసీపీ నుండి జనసేనలో చేరిన కుర్ల రాజశేఖర్ రెడ్డి, వాసు ఇద్దరూ పార్టీని విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. వీరిద్దరి చేరికతో పార్టీలో అసమ్మతి నెలకొందన్నారు. ఇన్నాళ్లు పార్టీ కోసం కష్టపడిన వ్యక్తులను దూరం పెట్టడం సరికాదన్నారు. వీరిద్దరి వల్ల పార్టీ విచ్ఛిన్నమయ్యే అవకాశం ఉందని, వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో కూనవరం ఎంపీటీసీ బండారు సాంబశివరావు, కూనవరం సర్పంచ్ మల్లంపల్లి హేమంత్ గాంధీ, వివిధ మండలాల నాయకులు మడివి రాజు, వెంకటరాయుడు, రాగల సురేష్, చిప్పల కన్నబాబు, కోడి రవి, బుడుగుల వీరభద్రం, చిలకం కన్నారావు, పల్లాలు రవి, రాజశేఖర్ రెడ్డి, ఇందుమర్రి గవర్రాజు, కవిత, శ్రీరామ్, పండు, సంతోష్, కూనవరం ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

గుబేలుపేటలో పారిశుధ్య పనులు

- ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-చింతూరు

'గుబేలుపేటలో పడకేసిన పారిశుధ్యం' శీర్షికన ప్రజాశక్తి శనివారం ప్రచురించిన కథనానికి చింతూరు పంచాయతీ అధికారులు స్పందించారు. మండల కేంద్రంలోని గుబేలుపేటలో పంచాయతీ సిబ్బంది శనివారం పారిశుధ్య పనులు చేపట్టారు. డ్రైనేజీల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించారు. మురుగునీటి కాలువల్లో మురుగునీరు ప్రవహించే విధంగా చర్యలు చేపట్టారు.



మురుగునీటి ప్రవాహానికి అడ్డంగా ఉన్న చెత్త, మట్టిని తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

సిపిఎం అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలి


మొద్దులగూడెంలో మాట్లాడుతున్న చిన్నబాబు, పూనెం సత్యనారాయణ

ప్రజాశక్తి-యంత్రాంగం

విఆర్.పురం : ఏజెన్సీలో ఆదివాసీల హక్కులు, చట్టాలు అమలు కావాలన్నా, పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కారం కావాలన్నా వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో అరకు పార్లమెంట్, రంపచోడవరం శాసనసభ నియోజకవర్గాల నుండి పోటీ చేస్తున్న సిపిఎం అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేయాలని సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ పిలుపునిచ్చారు. మండలంలోని మొద్దులగూడెం గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ వరదలు వస్తే ముందుగా ముద్దులగూడ గ్రామం ముంపునకు గురై రెండువైపులా రహదారులు బంద్ అయ్యే పరిస్థితి ఉందని పేర్కొన్నారు. అయినప్పటికీ మద్దులగూడెం గ్రామాన్ని ముంపు జాబితాలో చేర్చక పోవటం దారుణమన్నారు. సిపిఎం నాయకులు చట్టసభల్లో ఉంటే గ్రామాన్ని ముంపు జాబితాలో చేర్చి ప్యాకేజీ ఇచ్చేలా చేస్తారని తెలిపారు. పోడు భూములు సమస్య పరిష్కారం కావాలన్నా, పిల్లలకు ఉద్యోగాలకు సంబంధించి జీరో నెంబర్ 3 చట్టం పునరుద్ధరింపబడాలన్నా సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో సోడి మల్లయ్య, కుంజ కన్నయ్య, శాఖ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

జి.మాడుగుల: మండలంలోని ఉరుములో వనము సన్యాసిదొర అధ్యక్షతన శనివారం సిపిఎం ఆధ్వర్యంలో విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బోనంగి చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ, సిపిఎం ఎంపీ, ఎమ్మెల్యేల అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఆదివాసి ప్రాంతంలోని అడవులను బిజెపి ప్రభుత్వం అదానికి కట్ట పెట్టిందని విమర్శించారు. బిజెపి అభ్యర్థులను ఆదివాసి గిరిజనులు ఓట్లతో ఓడించాలని పిలుపునిచ్చారు. గిరిజన చట్టాలు, హక్కుల ఉల్లంఘన చేస్తున్న పార్టీలకు ఓటుతో తగిన బుద్ధి చెప్పాలన్నారు. గిరిజన చట్టాలు, హక్కుల సంరక్షణ కోసం పోరాడే సిపిఎం ఎంపీ, ఎమ్మెల్యేల అభ్యర్థులను చట్టసభలకు పంపించవలసిన బాధ్యత ఏజెన్సీ ప్రాంత ఆదివాసుల పైన ఉందన్నారు. ఈ సమావేశంలో భాషా వాలంటీర్ల సంఘం రాష్ట్ర నాయకులు నాయుడు, సిపిఎం మండల నాయకులు ధర్మారావు, ఎస్.సత్తిబాబు, వి.చిన్నం నాయుడు పాల్గొన్నారు.

బిజెపి ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీతను ఓడించాలి

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలోని సిపిఎం కార్యాలయం వద్ద శనివారం ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు, లక్ష్మీపురం సర్పంచ్ కొర్ర త్రినాథ్ ఆధ్వర్యాన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బిజెపి ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీతను ఓడించాలని పిలుపునిచ్చారు. ఆదివాసి గిరిజనుల హక్కులు చట్టాలపై పోరాటం చేస్తున్న సిపిఎం ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని కోరారు. హక్కులు, చట్టాలను కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వాలు సర్వనాశనం చేస్తున్నాయన్నారు. జీవో 3 రద్దు కావడంతో ఆదివాసి గిరిజన ప్రాంతంలో నిరుద్యోగులు ఎక్కువయ్యారన్నారు. అటవీ ప్రాంతంలో ఉన్న భూగర్భ ఖనిజ సంపదను బడా కార్పొరేట్లైన అదానీ, అంబానీలకు దారాదత్తం చేస్తుందన్నారు. చింతపల్లి మండలంలోని ఎర్రవరం, అనంతగిరి మండలం టోకురు గ్రామ పరిసరాల్లో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణాలు చేపట్టేందుకు ఎటువంటి గ్రామ సభ అనుమతి లేకుండా నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం ఒత్తిడితో రాష్ట్ర వైసిపి ప్రభుత్వం అనుమతి మంజూరు చేసిందని గుర్తు చేశారు. ఆదివాసీలకు రక్షణగా ఉండవలసిన వైసిపి ఎంపీ, ఎమ్మెల్యేలు కాంట్రాక్టర్ ఇచ్చే కమీషన్లకు ఆదివాసీల హక్కులు, చట్టాలను తాకట్టు పెట్టి బడా బాబులకు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి పాంగి, భీమరాజు, కొర్ర శంకర్రావు, పి.రామదాసు, కె.దంబ్రు పాల్గొన్నారు.

హుకుంపేట: మండలంలోని ప్రజలకు ఏ కష్టం వచ్చినా స్పందించి పోరాటాలు చేస్తున్న సిపిఎం ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని జెడ్పిటిసి గంగరాజు ప్రజలకు పిలుపునిచ్చారు. మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం చేపట్టారు. హుకుంపేట వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు మాట్లాడుతూ, బీజేపీ, వైసీపీలతో గిరిజనులకు ఉద్యోగాలు రాకుండా పోయాయన్నారు. సిపిఎం అభ్యర్థులను గెలిపిస్తే రోడ్లు, తాగునీరు వంటి ప్రధాన సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు హైమావతి, మండల నాయకులు కృష్ణా రావు, మూర్తి, సోమన్న, చందూ, చిరంజీవి,, నర్సింహ మూర్తి, కోటిబాబు, అప్పలస్వామి, వెంకట రమణ పాల్గొన్నారు.


జి.మాడుగులలో ప్రచారం చేస్తున్న నాయకులు


హుకుంపేటలో ప్రచారం చేస్తున్న గంగరాజు, నాయకులు


ప్రచారం చేపడుతున్న నాయకులు

లోగిలిలో కాంగ్రెస్ ప్రచారం

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండలంలోని లోగిలి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆ పార్టీ ప్రకటించిన మేనిఫెస్టోపై ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఉపాధి హామీ పథకం కింద జరిగే పనులకు రోజుకు రూ.400 కూలి చెల్లించడంతో పాటు రూ.420 కే వంట గ్యాస్ కనెక్షన్, 5 లక్షలతో ఇల్లు నిర్మాణం, ప్రతి కుటుంబానికి ఏడాదికి రూ లక్ష చొప్పున చెల్లిస్తామని ఆ పార్టీ మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పోతురాజు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు వెంకటరావు, భీమారావు, దామోదర్, రామచందర్ పాల్గొన్నారు.

ఎన్నికల ఫిర్యాదులకు టోల్ ఫ్రీ నెంబర్లు

ప్రజాశక్తి-పాడేరు: రానున్న సాధారణ ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదులకు ప్రస్తుతం ఉన్న 1950 టోల్ ఫ్రీ నంబరుతో పాటు మరో మూడు ల్యాండ్ లైన్ నంబర్లను అదనంగా ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల నిభందనల ఉల్లంఘన, బహుమతులు, నగదు పంపిణీ, అక్రమ తరలింపు, మత్తు పదార్థాల పంపిణీ, తరలింపు, తదితర ఎన్నికలకు సంబంధించిన అంశాలపై ప్రజలు ఈ దిగువ నంబర్లకు ఫిర్యాదు చేయవచ్చని కలెక్టర్ వివరించారు. ఫిర్యాదుల పర్యవేక్షణకు ఫోన్: 08935 –299912, 08935 –299934, 08935 –293448 నంబర్లు 24 గంటలూ అందుబాటులో ఉంటాయన్నారు.

ఎన్నికల నియమావళి పక్కాగా అమలు

ప్రజాశక్తి -పాడేరు: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పక్కాగా అమలు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా స్పష్టం చేసారు. శనివారం అల్లూరి జిల్లా కలెక్టర్, ఎస్పీలతో అమరావతి ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం నుండి ఎన్నికల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అక్రమంగా తరలిస్తున్న నగదు, మద్యం రవాణాపై పత్యేక దృష్టి పెట్టి సీజ్ చేయాలని ఆదేశించారు. జిల్లాలో ఉన్న వాలంటీర్ల సంఖ్య, వాలంటీర్ల రాజీనామాలు, తొలగింపులపై ఆరా తీసారు. జిల్లాలో ఎన్నికల పరిశీలకులు త్వరలో పర్యటిస్తారని చెప్పారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ భావనా వశిష్ట్, జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, డిఆర్ఓ పద్మావతి, ఎన్డీసి పి. అంబేద్కర్, నోడల్ అధికారి సువర్ణ ఫణి పాల్గొన్నారు.

ఎన్నికల ప్రశాంతతకు కూంబింగ్

ప్రజాశక్తి-పెదబయలు: మండలంలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సమస్యాత్మక గిరిజన ప్రాంతాల్లో స్పెషల్ పార్టీతో కూంబింగ్ నిర్వహిస్తున్నట్లు స్థానిక ఎస్ఐ పులి మనోజ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. వాహనాలపై ప్రయాణించేవారు జాగ్రత్తలు పాటించాలన్నారు. యువతకు వాలీబాల్ కిట్లు పంపిణి, మెడికల్ క్యాంపు ఏర్పాటు చేస్తున్నామని ఎస్ఐ తె లిపారు. ఎలక్షన్ సమయంలో ప్రజలు నేరంతో కూడిన పనులు చేస్తే కఠిన చర్యలు తీసుంటామన్నారు.

గుంటూరును కలిసిన సత్తివానిపాలెం నాయకులు

ప్రజాశక్తి- పెందుర్తి: పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వైసిపి రెబల్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న విశాఖపట్నం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుంటూరు వెంకట నరసింహారావును పెందుర్తి మండలం సత్తివానిపాలెం గ్రామానికి చెందిన పలువురు నాయకులు కలిసి మద్దతు పలికారు. శనివారం ఉదయం సరిపల్లిలోని నరసింహారావు ఇంటికి వచ్చిన బోడసింగి శ్రీకాంత్, పాండ్రంగి రమణ, పాండ్రంగి శంకర్రావు, సతివాడ గంగునాయుడు, చడగం సంతోష్ తదితరులు ఆయనతో చర్చలు జరిపారు. గతంలో మార్కెట్ కమిటీ చైర్మన్‌గా సత్తివానిపాలెం గ్రామానికి నరసింహారావు అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. వైసిపి నుంచి సీటు కోసం గట్టిగా ప్రయత్నించాలని నరసింహారావుకు వారు సూచించారు. వైఎస్ కుటుంబం అడుగుజాడల్లో నడుస్తున్న నరసింహారావుకు న్యాయం జరగాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

ఎన్నికల ప్రచార కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండల కేంద్రంలో శనివారం టీడీపీ జనసేన బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కిల్లు వెంకట రమేష్ నాయుడు గెలుపు కోసం కృషి చేయాలని టిడిపి నేతలు కోరారు. ఈ సందర్భంగా ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అనంతరం మండల ఎన్నికల ప్రచార కమిటీని ఎన్నుకున్నారు. ఎన్నికల ప్రచార కమిటీ అధ్యక్షులుగా కొండపల్లి పిన్నయ్యదొర (టీడీపీ), ప్రధాన కార్యదర్శిగా మసాడా బీమన్న (జనసేన), సలుగు సతీష్ (బీజేపీ), గెమ్మెలి అప్పారావు (టీడీపీ), బోయిని నూకరాజు (బీజేపీ), గొండి మురళి (జనసేన), పోతురాస గంగప్రసాద్ (జనసేన), కిముడు కళ్యాణం (టీడీపీ) , కొతారి పార్వతమ్మ (బీజేపీ) బొంగరం రాము నాయుడు (బీజేపీ) ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంల్లో టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ ఉపాధ్యక్షులు సోమెలి చిట్టీ బాబు, సీనియర్ నాయకులు సమిరెడ్డి నాగబ్బాయి, లకే బాలయ్య దొర, వంజరి రామూర్తి నాయుడు పాల్గొన్నారు.

జనసేనలో పలువురు చేరిక

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 96వ వార్డు పరిధి జనసేన కార్యాలయంలో శనివారం వైసిపి నాయకులు కల్యాణి ఆధ్వర్యాన 95వ వార్డుకు చెందిన సుమారు 25 కుటుంబాలు జనసేనలో చేరారు. వారికి కూటమి అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం రమేష్‌బాబు మీడియాతో మాట్లాడుతూ, జగన్మోహన్‌రెడ్డి పాలన మీద అందరూ అసంతృప్తిగా ఉన్నారని తెలిపారు. రాష్ట్రం ఏ విధంగా కూడా అభివృద్ధి చెందలేదన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కూటమి అధికారంలోకి వస్తే రాష్ట్రం అభివృద్ధిలో నడుస్తుందన్నారు.

జంక్ ఫుడ్స్‌తో అనారోగ్యం

కిమ్స్ ఐకాన్ డాక్టర్ ఆర్‌వి.రవికన్న



ప్రజాశక్తి -గాజువాక : జంక్ ఫుడ్ ఆరోగ్యాన్ని పాడు చేస్తాయని శీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్ హాస్పిటల్ కన్సల్టెంట్ ఇంటర్నల్ మెడిసిన్ డాక్టర్ ఆర్‌వి రవికన్నా తెలిపారు. జంక్ ఫుడ్ ఎక్కువగా తినడం అనారోగ్యకరమైన ఆహారపు అలవాటు అన్నారు. ఊబకాయం, మధుమేహం, గుండె జబ్బులు, దీర్ఘకాలిక వ్యాధులకు కారణమవుతున్నాయని తెలిపారు. కమ్యూనిటీలలో ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను ప్రోత్సహించాలని వివరించారు. వస్తువులను శుభ్రంగా ఉంచుకోవడం చాలా ముఖ్యం అన్నారు. చేతులు సరిగ్గా కడుక్కోవడం, మంచి పారిశుధ్య పద్ధతులు పాటించడం వల్ల వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఉంటాయని తెలిపారు. ఈ సాధారణ చర్యలు ప్రజారోగ్యాన్ని రక్షించడంలో పెద్ద మార్పును కలిగిస్తాయన్నారు. ఆరోగ్యం గురించి ప్రజలకు అవగాహన కల్పించడం కూడా చాలా ముఖ్యమని తెలిపారు.

ప్రతి ఒక్కరికీ స్వచ్ఛమైన గాలి, నీరు, ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని కలిగి ఉన్న భవిష్యత్తు కోసం కలిసి పనిచేయాలని కోరారు.

యోగాలో అండిబోయిన లక్ష్మికి గోల్డ్ మెడల్

ప్రజాశక్తి -గాజువాక : నేపాల్‌లో సమైక్య భారతీయ కేల్ ఫౌండేషన్ ఆధ్వర్యాన ఈ నెల ఒకటి నుంచి 5వ తేదీ వరకు సకార ఇంటర్నేషనల్ స్టేడియంలో జరిగిన పోటీల్లో ప్రముఖ న్యాయవాది లక్ష్మికి యోగాలో బంగారు పతకం లభించింది. విశాఖ స్టీల్‌ప్లాంట్ బిఎఫ్ విభాగం జనరల్ ఫోర్ మెన్ అండిబోయిన అప్పారావుకు పవర్ లిఫ్టింగ్ 93 కిలోల విభాగంలో మాస్టర్ టు కేటగిరీలో గోల్డ్ మెడల్ సాధించారు.



కళారూపాలతో అవగాహన కల్పిస్తున్న కళాకారులు

ఓటు హక్కు వినియోగంపై కళాజాతా

ప్రజాశక్తి-విఆర్.పురం : ఓటు హక్కు వినియోగంపై మండల కేంద్రం రేకపల్లి సెంటర్లో పాడేరుకు చెందిన రాజారాం, జయరాం బృందం వారు కళా రూపాల ద్వారా అవగాహన కల్పించారు. తహశీల్దారు మౌలానా పాజిల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అందరూ ఓటును సక్రమంగా వినియోగించుకోవాల్సిన అవసరాన్ని కళాకారులు వివరించారు ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి విచ్చేసిన ప్రజలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నూకాంబిక అమ్మవారి పండగకు ఏర్పాట్లు

ప్రజాశక్తి -సీలేరు : జికె.వీధి మండలం సీలేరు జలవిద్యుత్ కేంద్ర సమీపంలో ఉన్న నూకాంబిక అమ్మవారి ప్రధాన పండుగ కొత్త అమావాస్య రోజున ఘనంగా నిర్వహించడానికి ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా శనివారం సాయంత్రం ఐదు గంటలకు గణపతి పూజ నిర్వహించి అనంతరం అమ్మవారి గరగాలంకరణ కార్యక్రమం నిర్వహించారు. కొత్త అమావాస్య రోజు ఎనిమిదో తేదీన పండుగ నిర్వహిస్తారు. అమ్మవారి సన్నిధిలో భక్తులు మొక్కలు తీర్చుకుంటారు. భక్తులు ఆర్థిక సహాయంతో అమ్మవారి సన్నిధిలో భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.


పరీక్షల నిర్వహణను పరిశీలిస్తున్న ఎంఇఒ

పరీక్షలను పర్యవేక్షించిన ఎంఇఒ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : ఒకటో నుండి తొమ్మిదవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు శనివారం నుండి ప్రారంభమైన సమ్మేటివ్ పరీక్షలను స్థానిక ఎంఈఓ-2 సూరారెడ్డి పర్యవేక్షించారు, సింగంపల్లి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న సమ్మేటివ్ పరీక్షలను సూరారెడ్డి ఆకస్మిక తనిఖీ నిర్వహించి పరీక్షలు ఏ విధంగా జరుగుతున్నాయో ఆరా తీశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలోని 98 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 4,917మంది విద్యార్థులు సమ్మేటివ్ పరీక్షలు రాస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగంపల్లి ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం సుబ్రహ్మణ్యేశ్వరి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - చింతూరు : చింతూరు లారీ ఓనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సభ్యులు శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కె.మహాలింగం, కార్యదర్శిగా నక్క శీను, ఉపాధ్యక్షులుగా నారాయణ, కోశాధికారిగా పి.మహాలక్ష్మణ్, కోర్ కమిటీ సభ్యులుగా కె.బాబ్జి, ఏ శ్రీను, ఏ అనిల్ కుమార్, యన్ రామిరెడ్డి, యన్.ఏసు, డి. సతీష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

బిజెపితో పొత్తు పెట్టుకొని..

స్టీల్‌ప్లాంట్‌ని ఎలా రక్షిస్తారు ?

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎలో భాగస్వామిగా చేరి, రానున్న ఎన్నికలకుగాను బిజెపితో పొత్తు పెట్టుకొని విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రక్షిస్తామని తెలుగుదేశం విశాఖ పార్లమెంట్ అభ్యర్థి శ్రీభరత్, గాజువాక అసెంబ్లీ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా శ్రీనివాసరావులు ప్రకటించడమంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లే అవుతుందని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు విమర్శించారు. ఈ మేరకు ఆయన శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. అశేష త్యాగాలతో సాధించుకున్న వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను కేంద్ర బిజెపి ప్రభుత్వం అమ్మకానికి పెట్టిందని తెలిపారు. ఈ ప్రజా ద్రోహానికి వ్యతిరేకంగా స్టీల్‌ప్లాంట్ కార్మికులతో పాటు విశాఖ ప్రజలు మూడు సంవత్సరాలుగా పోరాడుతున్నారని పేర్కొన్నారు. ప్లాంట్‌ను అష్టదిగ్బంధనం చేసి నష్టాల్లోకి నెట్టి మోడీ అనుకూల కార్పొరేట్లకు కట్టబెట్టే కుట్రలో బిజెపి ప్రభుత్వం ఉందన్నారు. ప్రజలకు ద్రోహం చేస్తున్న బిజెపితో టిడిపి, జనసేన పొత్తు వల్ల విశాఖ స్టీల్‌ప్లాంట్ మరింత ప్రమాదంలో పడిందని తెలిపారు. బిజెపి, టిడిపి, జనసేన కూటమి వల్ల స్టీల్‌ప్లాంట్‌ను రక్షించలేరని, అమ్మకానికే మార్గం సుగమం చేస్తారని అన్నారు. అధికార వైసిపి ప్రభుత్వం కేంద్రాన్ని స్టీల్‌ప్లాంట్ విషయంలో నిలదీయలేకపోయిందన్నారు. కనుక స్టీల్‌ప్లాంట్‌ను అమ్మకం నుంచి కాపాడాలంటే బిజెపి, టిడిపి, జనసేన కూటమితో పాటు నిరంకుశ వైసిపిని ఓడించాలన్నారు. ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించడమే స్టీల్‌ప్లాంట్‌కు రక్షణని తెలిపారు.

మ్యానిఫెస్టో పేర టిడిపి మరో మోసం
సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు

ఆంధ్రప్రదేశ్‌కి తీవ్ర ద్రోహం చేసిన బిజెపి సాయంతో విశాఖ స్టీల్‌ప్లాంట్‌ని రక్షించడంతో పాటు విశాఖ రైల్వే జోన్‌ను, విశాఖ మెట్రో రైల్‌ను సాధిస్తామని తెలుగుదేశం మ్యానిఫెస్టోలో ప్రకటించడం అంటే విశాఖ ప్రజలను మరోసారి మోసం చేయడమే అవుతుందని పేర్కొన్నారు. వారి మోసకారి మ్యానిఫెస్టోలను నమ్మొద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇంతవరకు బిజెపి ప్రజలను వంచించిందని, ఇప్పుడు టిడిపి, జనసేనలు వంచకులతో జట్టుకట్టి ప్రజలను మోసం చేయ చూస్తున్నాయని తెలిపారు. టిడిపి, జనసేన, వైసిపిలకు ఎవరికి ఓటేసినా అది బిజెపికి ఓటు వేసినట్లేనని ప్రజలు గ్రహించాలన్నారు.

ఆ పార్టీలను ఓడిస్తేనే స్టీల్‌ప్లాంట్‌కు, గాజువాకకు, విశాఖకు, యువతకు, కార్మికులకు భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం కాకుండా కాపాడుకోగలగడం సాధ్యమౌతుందన్నారు. విశాఖ, గాజువాక ప్రజలు చైతన్యపూరిత నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కెకె లైన్‌లో రైల్వే డిఆర్ఎం తనిఖీలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వాల్తేర్ డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ శనివారం కొత్తవలస - కిరండూల్ (కెకె) లైన్‌లోని అరకు - కొత్తవలస సెక్షన్‌లో సమగ్ర భద్రతా తనిఖీలు చేపట్టారు. కీలకమైన ఈ రైలు మార్గంలో భద్రత ప్రధానమైనదని ఆయన పేర్కొన్నారు. అరకులోని ట్రాక్షన్ డిస్ట్రిబ్యూషన్ డిపో నిర్వహణ పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. ఓవర్‌హెడ్ ఎక్విప్‌మెంట్ ట్రాక్షన్ సబ్-స్టేషన్ నిర్వహణను, కెకె లైన్‌లోని సొరంగాలలో పరిస్థితులను పరిశీలించారు. అనంతరం సిమిలిగుడ - అరకు సెక్షన్ల మధ్య కెకె 22 లెవల్ క్రాసింగ్‌ను పరిశీలించి సేఫ్టీ ఆడిట్ నిర్వహించారు. అక్కడి గేట్‌మ్యాన్‌తో సంభాషించారు. భద్రతా ప్రమాణాలను గుర్తుచేశారు. చివరిగా అరకు రైల్వే స్టేషన్‌లోని రైల్వే హెల్త్ యూనిట్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. వైద్య సిబ్బందితో మాట్లాడారు.


తనిఖీలు నిర్వహిస్తున్న డిఆర్ఎం

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సముద్రంలో బోటులో జరిగిన అగ్ని ప్రమాదంలో గాయపడి కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న మత్స్యకారులను శనివారం దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ పరామర్శించారు. ప్రమాద పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెరుగైన వైద్యంతో పాటు, వారి కుటుంబ సభ్యులకు వసతి, నాణ్యమైన భోజనం తానే అందిస్తానని అన్నారు. అధైర్య పడకుండా ఉండాలని, ప్రభుత్వం తరపున అన్ని విధాలా ఆదుకుంటామని భరోసానిచ్చారు. ప్రమాదం జరిగిన వారిలో 50 శాతం కాలిన వారు క్షేమంగా ఉన్నప్పటికీ, 80 శాతం కాలిన వారి పరిస్థితి క్రిటికల్‌గా ఉందని డాక్టర్లు తెలిపారన్నారు. ఆయన వెంట వైసిపి దక్షిణ ఎన్నికల పరిశీలకులు శ్రీ వాత్సవ్, 37వ వార్డు కార్పొరేటర్ చెన్నా జానకిరామ్, మత్స్యకార నాయకులు పులి రాజు పాల్గొన్నారు.

37వ వార్డులో ప్రచారం

దక్షిణ నియోజకవర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్ కుమార్ 37వ వార్డు పరిధి బీచ్ రోడ్డు, కొత్త అగ్రహారం కాలనీ నుంచి ప్రచారం ప్రారంభించారు. రెల్లి సామాజిక తరగతి అండతో మరోసారి తాను గెలుపొందడం తథ్యమని అన్నారు. భజన కోవెల, ఆసిపావీధి, రెల్లి వీధి, జబ్బర్ తోట, పెయిన్ దొర పేట, గాంధీ బొమ్మ ప్రాంతాల్లో ఆయన ప్రచారం సాగింది. ఆయన వెంట వైసిపి జిల్లా అధ్యక్షులు కోలా గురువులు, దక్షిణ ఎన్నికల పరిశీలకులు ద్రోణంరాజు శ్రీవాత్సవ్ పాల్గొన్నారు.



దట్టంగా కమ్మేసిన పొగ

ఎఒబి అటవీ ప్రాంతంలో దట్టంగా పొగ

- అధిక వేడితో ఇబ్బంది పడ్డ సీలేరు పరిసర ప్రాంత ప్రజలు

ప్రజాశక్తి-సీలేరు : ఆంధ్ర ఒరిస్సా సరిహద్దులోని గుంటవాడ పరిసర అటవీ ప్రాంతంలో శనివారం ఉదయం నుండి దట్టంగా పొగ కమ్మేసింది. అటవీ ప్రాంతం నుండి సీలేరు పరిసర ప్రాంతాలకు పొగ వ్యాపించడంతో ఇక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఆకతాయలు అడవికి నిప్పు పెట్టడంతో మంటలు వ్యాపించి పొగ వచ్చినట్లు తెలుస్తోంది. ఈ మంటల వల్ల సీలేరు పరిసర ప్రాంతానికి శనివారం ఉదయం 6 గంటల నుండే దట్టమైన పొగ వ్యాపించడంతో ఇక్కడి వాతావరణంలో వేడి పెరిగింది. ఇప్పటికే భానుడి ప్రతాపంతో సీలేరులో 37 నుండి 40 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదై ప్రజలు ఎండ వేడికి ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ వేడికి, అటవీ ప్రాంతంలో పొగ ద్వారా వచ్చే వేడి తోడు కావడంతో సీలేరు, పరిసర ప్రాంత ప్రజలు అనేక ఇబ్బందులు గురయ్యారు.

సప్పర్ల ప్రాంతంలో ..

జీకే వీధి మండలం సప్పర్ల సమీపంలోని అటవీ ప్రాంతం అగ్నికి ఆహుతైంది. అటవీ ప్రాంతంలో మంటలు వ్యాపించి కాలి బూడిదైనట్లు తెలుస్తోంది. ఆకతాయలే ఈ పని చేసి ఉంటారని భావిస్తున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి అటవీ సంపద కాపాడే దిశగా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

రెండు బైక్‌లు ఢీ : ఒకరు దుర్మరణం

ప్రజాశక్తి - ఎటపాక : మండలంలోని నెల్లిపాక చోడవరం మధ్య ఫారెస్ట్ చెక్ పోస్ట్ వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... నెల్లిపాక గ్రామానికి చెందిన మడివి చందు తన తల్లితో భద్రాచలం నుండి నెల్లిపాక బైక్‌పై వస్తున్నాడు. తెలంగాణ రాష్ట్రం ములకలపల్లి మండలం మూకమామిడి గ్రామనికి చెందిన పెట్టెం రాజు (30) బైక్‌పై నెల్లిపాక నుండి భద్రాచలం వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో చోడవరం చెక్ పోస్ట్ వద్ద రెండు బైక్‌లు ఎదురుదురుగా ఢీ కొన్నాయి. ఈ ఘటనలో పెట్టెం రాజు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. చందుకి తీవ్ర గాయలు కాగా, చందు తల్లికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టిడిపిలో చేరిన జమాల్ ఖాన్

ప్రజాశక్తి-చింతూరు : చింతూరుకు చెందిన ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్ నెల్లూరు జిల్లాకు చెందిన నాటు మందు వైద్యుడు ఆనందయ్యతో శనివారం పాలకొల్లులో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి చంద్రబాబు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

'విద్యార్థులను హాస్టల్ నుంచి బలవంతంగా ఇంటికి పంపొద్దు'

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగరంలోని బిసి కాలేజీ హాస్టల్ విద్యార్థులను వారి డిగ్రీ ఆరో సెమిస్టర్ పూర్తికాకముందే కాలేజీ హాస్టల్ నుంచి వార్డెన్ పంపించడం తగదని పిడిఎస్ఒ విశాఖ జిల్లా అధ్యక్షులు పి.విశ్వనాథ్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఉదయం ఎంవిపి.కాలనీలోని బిసి హాస్టల్ వద్ద సంఘం ఆధ్వర్యాన నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం బిసి వెల్ఫేర్ అధికారిణి శ్రీదేవిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్.రుద్రి, విశాఖ జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు ఎం.లలిత, సతీష్, ప్రసాద్ పాల్గొన్నారు